నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 19 నవంబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

- మా భూములు కంపెనీకి ఇచ్చేది లేదు
- అరెస్టు చేసి నోళ్లను విడుదల చేయాలి
- మొగోళ్లుతా భయంతో పరార య్యారు
- మా ఊళ్లల్లోకి పోలీసులు రాకుండా చూడాలి
- జాతీయ ఎస్టీ కమిషన్ ఎదుట కన్నీరు పెట్టుకున్న లగచర్ల, రోటిబండతండా బాధితులు


రోటిబండ తండాలో గిరిజనులతో మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జలోతు హుస్సేన్

ఫార్మా వద్దు..

మహబూబ్‌నగర్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/కోస్గి : లగచర్ల, రోటిబండతండా, పులిచర్ల తండా, హకీంపేట, పోలేపల్లి వాసుల్లో భయం నెలకొన్నది. ఫార్మా సిటీకి ఎట్టి పరిస్థితుల్లో తమ భూములు ఇచ్చేది లేదన్న వారిపై సర్కారు కర్కశత్వం, పోలీసుల దాడులు జరుగుతుండడంతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. వారం కిందట కలెక్టర్, అధికారులపై జరిగిన దాడి.. అనంతరం జరుగుతున్న పరిణామాలు తండాలను భయం గుప్పిట్లోకి నెట్టేశాయి పది నెలలుగా కనీస సమాచారం ఇవ్వకుండా.. అధికార యంత్రాంగం ఫార్మా కంపెనీల కోసం భూసేకరణ చేపట్టడం వివాదాస్పదంగా మారుతున్నది. గిరిజనుల ఆందోళనలు పక్కకు పెట్టి బలవంతంగా భూసేకరణ చేపట్టడంతో దాడికి కారణమైంది. ఈ నేపథ్యంలో సీఎం సొంత జిల్లాలోని శాంతిభద్రతలు అదుపు తప్పాయి. ఫలితంగా పోలీసు వ్యవస్థ రాజ్యమేలుతోంది. రాత్రిళ్లు తండాల మీద పడి అనుమానితుల కోసం ప్రశ్నిస్తూనే ఉన్నారు. ఈ ఐదు గ్రామాలు పోలీసుల పహారాలో ఉన్నాయి. చాలామంది భయంతో పారిపోగా, మరికొందరిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఇంకొందరు ఎక్కడికి వెళ్లారో తెలియని పరిస్థితి నెలకొన్నది.

జాతీయ ఎస్టీ కమిషన్ బృందం పర్యటన..

లగచర్ల గిరిజనులపై జరిగిన అమానుష ఘటనను విచారించేందుకు సోమవారం జాతీయ ఎస్టీ కమిషన్ బృందం పర్యటించింది. ఈ పర్యటన కూడా పోలీసు పహారాలో కొనసాగడం విమర్శలకు తావిస్తోంది. మరోవైపు దాడి వెనుక బయట వ్యక్తుల ప్రమేయం ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేసింది. వెంటనే పోలీసులు తండాల జోలికి వెళ్లొద్దని.. అనుమానిస్తున్న వారిని వెంటనే విడుదల చేయాలని కమిషన్ బృందం ఆదేశించింది. గిరిజనులపై అమానుషాన్ని ఆపకపోతే బాధ్యులందరినీ సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. జరిగిన ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ.. డీజీపీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా నివేదిక కోరతానని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జలోతు హుస్సేన్ వెల్లడించారు.

పోలీసుల తీరుపై కమిషన్ ఆగ్రహం..

సాక్షాత్తు సీఎం సొంత నియోజకవర్గంలో పోలీసుల తీరుపై జాతీయ ఎస్టీ కమిషన్ బృందం మండిపడింది. ఏకపక్షంగా సాగుతున్న భూసేకరణ ఏమిటని నిలదీసింది. కొన్ని నెలలుగా ఫార్మా కంపెనీ వస్తుందని ప్రచారం జరుగుతుండగా, అసలు ఇక్కడికి వస్తున్నది.. ఫార్మా కంపెనీయా? లేక ఇతర కంపెనీలా? అనేది స్పష్టత ఇవ్వడం లేదని గుర్తించింది. గిరిజనులు తమ భూములు ఇవ్వడానికి వెనుకడుగు వేస్తున్నారు. పాద యాత్రలు చేశారు.. ఆందోళనలు నిర్వహించారు.. నిరాహార దీక్షలు చేపట్టారు. అయినా ప్రభుత్వాధికారులు ఇవేవీ పట్టించుకోకుండా భూసేకరణకు ముందుకు వెళ్లడంపై కమిషన్ బృందం తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేసింది. తమ భూములు ఇవ్వమని తెగేసి చెప్పిన వారికి నచ్చజెప్పేదిపోయి రాజకీయాల కోసం పరితపిస్తారా? అంటూ అధికారులను నిలదీసింది. ఇంతకు ఎలాంటి కంపెనీలు పెడుతున్నారు.. ప్రజలకు ఎందుకు తెలియజేయడం లేదంటూ.. అధికారుల తీరుపై విస్మయం వ్యక్తం చేసింది.

తండాల్లో పోలీసులు కనపడొద్దు..

కలెక్టర్ ఇతర అధికారులపై దాడి ఘటన వెనుక ఇతరుల ప్రమేయం ఉండొచ్చని జాతీయ ఎస్టీ కమిషన్ బృందం అభిప్రాయపడింది. అమాయకులైన గిరిజనులను ఇందులో ఇరికించడానికి కొంతమంది రాజకీయ నేతలు పన్నాగం చేసి ఉండొచ్చని సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈ ఘటనను అడ్డం పెట్టుకొని పోలీసులు తమ ప్రతాపం చూపించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తపరిచింది. గ్రామాల్లో, తండాల్లో మనుషులే కనిపించడం లేదు? ఎక్కడికి వెళ్లారు..? ఉన్నారా? పారిపోయారా? అంటూ ప్రశ్నించారు. ఇంతదారుణంగా వ్యవహరిస్తారా? ఇవాళ్టి నుంచి ఒక్క పోలీసు కూడా తండాల్లో కనపడవద్దని కమిషన్ బృందం హెచ్చరించింది. అక్కడే ఉన్న వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డిని పిలిచి జరిగిన ఘటనపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచి పోలీసులెవరూ తండాల జోలికి వెళ్లవద్దని, ఎక్కడ కూడా పోలీస్ పికెట్లు పెట్టొద్దంటూ ఆదేశాలిచ్చింది.

సీఎం సోదరుడిపై ఆగ్రహం..

'మేము ఓట్లు వేసింది తిరుపతిరెడ్డికా, రేవంత్‌రెడ్డికా.. మా ఓట్లతోనే రేవంత్ సీఎం అయ్యావు.. ఒక్కసారైనా మా తండాలకు వచ్చావా..? మాతో మాట్లాడినవా? అంటూ గిరిజన మహిళలు, కమిషన్ బృందం ఎదుట వాపోయారు. 200 మంది పోలీసులతో తిరుపతిరెడ్డి మా తండాలకు వచ్చి భూములు ఇవ్వకపోతే మీ సంగతి చూస్తా.. అంటూ బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా అరెస్టు చేసిన వారందరినీ విడుదల చేయాలని, జైల్లల్లో ఉన్న తమ వారిని వెంటనే విడిపించాలన్నారు. మేం సచ్చినా మా భూములు ఇవ్వమని తేల్చి చెప్పారు. జాతీయ ఎస్టీ కమిషన్ బృందం వెంట ఐజీ సత్యనారాయణ, వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డితోపాటు దాదాపు 200 మంది పోలీసులు రావడం తండావాసులను మరింత భయాందోళనలను గురిచేసింది.

కాళ్ల మీద పడి.. కన్నీటి పర్యంతమై..

జాతీయ ఎస్టీ కమిషన్ బృందం లగచర్ల పర్యటన ఉద్విగ్నభరితంగా సాగింది. మధ్యాహ్నం రోటిబండతండాకు చేరుకున్న బృందానికి మహిళలు కాళ్ల, వేళ్ల పడుతూ తమను కాపాడాలంటూ వేడుకోవడం కనిపించింది. వారందరినీ అక్కున చేర్చుకుంటూ మీ కోసమే నేను వచ్చానంటూ బృందం సభ్యులు భరోసా కల్పించారు. తమ భర్త, పిల్లలను అన్యాయంగా తీసుకెళ్లారని, ఇంకొందరు ఎక్కడున్నారో కూడా తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు, ముసలోళ్లను పట్టుకొని రాత్రిపూట పొలాల్లో పడుకుంటున్నామని వివరించారు. రాత్రయితే చాలు పోలీసులు తమ గ్రామానికి వచ్చి వేధిస్తున్నారని వాపోయారు. ఊర్లల్లో ఆడోళ్లే మిగిలింద్రు.. మా ఆడ పోలీసులను తీసుకొచ్చి మీ సంగతి చెబుతామంటూ బెదిరిస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో చలించిన కమిషన్ బృందం పోలీసులను తీవ్రస్థాయిలో హెచ్చరించింది. ఇకపై తండాల జోలి కొస్తే బాగుండదని, ఎవరైనా పోలీసులు వస్తే తనకు ఫోన్ చేయాలని కమిషన్ సభ్యుడి ఫోన్ నెంబర్ ఇచ్చారు. ఇకముందు ఇబ్బందులు రావని భరోసా కల్పించారు.

సమగ్ర నివేదిక అందజేస్తాం..

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జలోతు హుస్సేన్
- రాజకీయాల కోసం పరితపిస్తారా అంటూ ఆగ్రహం

లగచర్ల సమీపంలో ఏర్పాటు చేస్తున్న కంపెనీలు ఏవో తెలియడం లేదు. ఎవరికోసం, ఎందుకోసం భూసేకరణ చేపడుతున్నారనేది గిరిజనుల అభిప్రాయాలను బట్టి అర్థమవుతుందని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జలోతు హుస్సేన్ అన్నారు. రోటిబండతండాలో మీడియాతో మాట్లాడుతూ జరిగిన ఘటన దురదృష్టకరమే అయినప్పటికీ.. ఈ ఘటన వెనుక బయట వ్యక్తుల ప్రమేయం ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. భూసేకరణ చేసేటప్పుడు ఏ కంపెనీలు వస్తాయి? ఎందుకోసం పెడుతున్నాం? పూర్తిస్థాయిలో వివరించాల్సి ఉండగా ఇలాంటి ప్రయత్నం ఏమీ జరగడం లేదని తెలిసిందన్నారు. అందుకే గిరిజనులు భయంతో ఉన్నారని.. వారు సమ్మతిస్తేనే భూములు తీసుకోవాలని సూచించారు. జరిగిన ఘటనలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు సిఫార్సు చేస్తామని వెల్లడించారు. డీజీపీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నివేదిక కోరతానన్నారు. పోలీసులు భయభ్రాంతులకు గురి చేయడం వల్లే పల్లెలో జనం కనిపిస్తలేరని కమిషన్ బృందం వాపోయింది.

నా భర్తను అన్యాయంగా ఇరికించారు..

'నా భర్త రాఘవేందర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఘటన జరిగిన రోజు ఇతర గ్రామంలో డ్యూటీ చేసి రాత్రికి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి పోలీసులు వచ్చి తలుపులు బాది నా భర్తను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు.. ఈ ఘటనలో నా భర్త అసలే లేడు. రెండు రోజుల కిందట అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇదేం అన్యాయం'.. అంటూ కమిషన్ బృందం ఎదుట రాఘవేందర్ భార్య కన్నీరు మున్నీరవుతూ విలపించింది. దీంతో కమిషన్ సభ్యుడు తాసీల్దార్, ఎస్పీని నిలదీశారు. అక్రమంగా అరెస్టు చేసిన పంచాయతీ కార్యదర్శిపై పూర్తిస్థాయి విచారణ జరిపి కేసు నుంచి తొలగించాలని సూచించారు. దీంతో ఎస్పీ నారాయణరెడ్డి విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఫార్మాకు నీళ్లిచ్చి.. పొలాలను ఎండబెడతారా?

- ఏడు టీఎంసీల కేటాయింపు పూర్తికు ప్రభుత్వం ప్రతిపాదనలు
- నాలుగు నియోజకవర్గాల ప్రజలకు కన్నీళ్లే..
- కాళోజీ పేరెత్తే అర్హత కాంగ్రెస్‌కు లేదు
- ఇచ్చిన మాట తప్పి వరంగల్‌కు వెళ్లడం సిగ్గుచేటు
- రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదు : సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : కొడంగల్ ఫార్మా సిటీకి కృష్ణానది నుంచి 7 టీఎంసీల నీటిని తరలించడానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందని, దీని వల్ల దేవరకద్ర, మక్తల్, వనపర్తి, కొల్లాపూర్ ప్రాంత వ్యవసాయ రంగానికి గొడ్డలిపెట్టుగా నిలుస్తుందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వనపర్తిలోని సింగిరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లగచర్ల భూసేకరణ, ఫార్మా కంపెనీకి నీటి తరలింపు, సీఎం వరంగల్ పర్యటన, చేతి కొచ్చిన పంటలపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యాన్ని నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. ఫార్మా కంపెనీలకు నీటి తరలింపుతో ఉమ్మడి పాలమూరులోని నాలుగు నియోజకవర్గాల రైతులకు సాగునీటి కడగండ్లు తప్పవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ముచ్చర్ల వద్ద ఫార్మా సిటీ కోసం 14 వేల ఎకరాలు సేకరించిందన్నారు. ఇక్కడ ఫార్మా సిటీని ఏర్పాటు చేస్తూ ఇందుకు గోదావరి నుంచి నీటిని తరలించాలని అప్పట్లోనే ప్రతిపాదన చేసినట్లు తెలిపారు. ఇది పక్కన పెట్టిన సీఎం రేవంత్ కొడంగల్‌లో వద్దన్న చోట ఫార్మాసిటీ పెట్టి ప్రజల జీవితాల్లో కాలుష్యాన్ని నింపడంతోపాటు వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నడం సిగ్గుచేటన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత, మూర్ఖపు చర్యగా అభివర్ణించారు. రైతులను బెదిరించి, భయపెట్టి, బలవంతంగా భూసేకరణ చేసి ఫార్మా సిటీ కోసం ఉన్న కొద్ది కృష్ణా నదీ జలాలను వాడుకోవాలని చూడడం హేయమైన చర్య అన్నారు. అదనంగా నీళ్లు తెచ్చే పనులు వదిలేసి ఉన్న నీళ్లకు గండి కొడుతున్నాడని మండిపడ్డారు. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని, పాలమూరు రైతుల ప్రయోజనాలు దీర్ఘకాలికంగా దెబ్బ తింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాదిగా ఒక్క టీఎంసీ నీటిని ఇచ్చే పనులను రేవంత్‌రెడ్డి చేపట్టలేదని, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో మిగిలిన కొద్ది పనులను పూర్తి చేసుంటే 60 శాతం మేర పొలాలకు నీళ్లు వచ్చేవన్నారు. కాళేశ్వరం నీళ్లే రాలేదని ఎగతాళి చేసుకుంటూ అభండాలతో కాలయాపన చేయడం తప్ప కాంగ్రెస్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కాళేశ్వరం నీళ్లే లేకుంటే హల్దీవాగు, ఇతర రిజర్వాయర్లకు సాగునీరెక్కడిదని ప్రశ్నించారు. పదేండ్ల పాలనలో ఎన్నో పెండింగ్ ప్రాజెక్టులను తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్దిష్ట కాలపరిమితితో

మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

పూర్తిచేసినట్లు గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు తాగేందుకు గుక్కెడు నీళ్లివ్వకపోగా, చెరువు, కుంటలను ఎలా ధ్వంసం చేశారో ప్రజలు కళ్లారా చూడడంతోపాటు తాగు, సాగునీటి గోసపై అనేక పుస్తకాలు సైతం వెలువడ్డాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో భారీ వాగులను అనుసరించి వెయ్యికి పైగా చెక్ డ్యాంలను నిర్మించి సేద్యానికి సాగునీటిని అందించడం జరిగిందన్నారు. కాళేశ్వరం, సీతారామ, పాలమూరు-రంగారెడ్డి వంటి ప్రాజెక్టులను చేపట్టి నీటి పారుదల వ్యవస్థను కేసీఆర్ బలోపేతం చేశారన్నారు. తెలంగాణలో అగ్రగామిగా పంటలు పండుతున్నాయని చెబుతున్నారని, ఇందుకు కాంగ్రెస్ చేసిన కృషి ఏమున్నదో వెల్లడించాలని డిమాండ్ చేశారు. రైతు డిక్లరేషన్ ప్రకటించిన వరంగల్‌కు నేడు సీఎం వెళ్తున్నాడని, సగం మంది రైతులకు రుణమాఫీ చేసి రైతుభరోసాకు ఎగనామం పెట్టి కాళోజీ కాలక్షేత్రం ప్రారంభోత్సవానికి రేవంత్ వెళ్లడం కాంగ్రెస్ ప్రభుత్వ నైతికతకు నిదర్శనమన్నారు. కాళోజీ పేరు ఎత్తే అర్హత కాంగ్రెస్‌కు లేదని, జీవిత కాలం కాంగ్రెస్ మీదనే పోరాటం చేసి స్ఫూర్తి నింపిన మహనీయుడు కాళోజీ అని పేర్కొన్నారు. వరంగల్ నుంచే రైతుల తిరుగుబాటు త్వరలోనే మొదలవుతుందని, అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని, ఏ ఒక్కరు కూడా సంతోషంగా లేరని మాజీ మంత్రి సింగిరెడ్డి పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజల పక్షాన నిలిచి పోరాటాలు చేస్తామన్నారు.

రేపు మాజీ మంత్రి హరీశ్‌రావు రాక

చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

- కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు : చిట్టెం

మక్తల్/దేవరకద్ర రూరల్, నవంబర్ 18 : కలియుగ దైవం కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు బుధవారం మాజీ మంత్రి హరీశ్‌రావు వస్తున్నారని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హరీశ్‌రావుతోపాటు మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడుతోపాటు ఉమ్మడి జిల్లాలోని మాజీ శాసనసభ్యులు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు స్వామివారి దర్శించుకోనున్నట్లు తెలిపారు.

జడ్చర్ల బల్దియా గులాబీదే..

- చక్రం తిప్పిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి
- మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పుష్పలత ఏకగ్రీవం
- సంబురాల్లో మునిగి తేలిన బీఆర్ఎస్ శ్రేణులు

జడ్చర్ల, నవంబర్ 18 : జడ్చర్ల మున్సిపాలిటీని గులాబీ పార్టీ మళ్లీ కైవసం చేసుకున్నది. కోనేటి పుష్పలతను ఏకగ్రీవంగా చేస్తూ ఆర్డీవో నవీన్ నియామక పత్రాన్ని అందజేశారు. రెండు నెలల కిందట పార్టీలో కొంత మందిని రెచ్చగొట్టినప్పటికీ మాజీ మంత్రి లక్ష్మారెడ్డి చక్రం తిప్పి మళ్లీ బీఆర్ఎస్‌కే పీఠం దక్కేలా పావులు కదిపారు. కాంగ్రెస్ నేతలకు ఆశాభంగం తప్పలేదు. ఒక్క కౌన్సిలర్ కూడా పార్టీ గీత దాటకపోవడంతో మళ్లీ బీఆర్ఎస్‌కే చైర్మన్ పదవి దక్కింది. సోమవారం జడ్చర్ల మున్సిపాలిటీలోని సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు కౌన్సిలర్లతో ఆర్డీవో నవీన్ సమావేశం నిర్వహించారు. గతంలో చైర్‌పర్సన్‌గా ఉన్న దోరేపల్లి లక్ష్మిని రెండు నెలల కిందట అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి పదవి నుంచి పాలకవర్గం తొలగించింది. చైర్‌పర్సన్ ఎన్నికకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే 26వ వార్డు కౌన్సిలర్ శశికిరణ్ పుష్పలత పేరు ప్రతిపాదించగా, 17వ వార్డు కౌన్సిలర్ గుంటికాడి చైతన్య బలపరిచారు. పుష్పలత తప్పా ఇంకెవరూ నామినేషన్ వేయకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికైంది. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లందరూ పుష్పలతకు మద్దతు ఇవ్వాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికకు సరిపడా సంఖ్యాబలం లేకపోవడంతో చైర్పర్సన్ పదవికి నామినేషన్ వేయలేదు. చివరి వరకు కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. మళ్లీ జడ్చర్ల పీఠం బీఆర్ఎస్‌కే దక్కడంతో పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. చైర్‌పర్సన్‌గా ఎన్నికైన పుష్పలతోపాటు కౌన్సిలర్లు మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారిని ఆయన అభినందించారు.

నియామకపత్రం అందుకుంటున్న పుష్పలత

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఎస్ఎన్ఎస్ కంపెనీపై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజయుడికి గ్రామస్తుల మొర

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 18 : జింకలపల్లిలోని ఎస్ఎన్ఎస్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ భర్త శ్రీధర్‌రెడ్డి, షేక్‌పల్లి, కొండేరు, జింకలపల్లి గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీ విషపూరితమైన కాలుష్యంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. తీవ్రమైన దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈదన్న, మాజీ జెడ్పీటీసీ సత్యారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్, వీరబాబు, శేషు, నారాయణ, మద్దిలేటి, శివ, గోవింద్, చిన్న మద్దిలేటి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అభ్యర్థుల అనాసక్తి

- గ్రూప్-3 పరీక్షకు సగానికిపైగా దూరం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 18 : గ్రూప్-3 పరీక్షలకు సగం మంది అభ్యర్థులు దూరంగానే ఉండిపోయారు. గతంతో పోలిస్తే అభ్యర్థుల హాజరు భారీగా తగ్గింది. ఆదివారం నిర్వహించిన పేపర్-1, పేపర్-2కు సకాలంలో హాజరుకాని వివరాలు వెల్లడించిన అధికారులు సోమవారం జిల్లాలో ఎంతమంది హాజరయ్యారన్న వివరాలను వెల్లడించలేదు. హాజరు శాతాన్ని వెల్లడించేందుకు టీజీపీఎస్సీ అధికారుల అనుమతి లభించలేదని తెలిపారు. మొత్తం 1,365 గ్రూప్-3 పోస్టుల భర్తీకి గానూ రాత పరీక్షలు నిర్వహించారు. మొత్తం 3 పేపర్లకు పరీక్షలు నిర్వహించగా, ఉమ్మడి పాలమూరు జిల్లాలో 50,025 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో సగం మంది మాత్రమే పరీక్షలకు హాజరు కావడం విశేషం. సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు పేపర్-3 పరీక్ష నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా మొత్తం 52 పరీక్షా కేంద్రాల్లో 19,465 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 55 శాతం మంది మాత్రమే హాజరైనట్లు తెలుస్తోంది. మొదటి రోజు పేపర్-1, పేపర్-2 పరీక్ష రాసిన వారిలోనూ కొందరు పేపర్-3 రాయలేదు. ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద హాల్‌టికెట్ మర్చిపోయి ఒకరు నిరాశతో వెనుదిరిగారు. బాలికల జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థి నిర్దేశిత గడువు ముగియడంతో వెనుదిరిగాడు. ఎస్సీ జాగికి

మహబూబ్‌నగర్‌లో తనిఖీ చేస్తున్న సిబ్బంది

మహబూబ్‌నగర్ పట్టణంలోని మహాత్మాగాంధీ రోడ్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ సురేశ్‌కుమార్ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల వద్ద పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సెంటర్ల వద్ద 163 బీఎన్ఎస్ సెక్షన్ అమలు చేసి భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న బూసాని వెంకటేశ్వరరావు

రిజర్వేషన్లపై అభిప్రాయ సేకరణ

- హాజరైన ఉమ్మడి జిల్లాలోని సంఘాలు, ప్రతినిధులు
- నివేదికను అందిస్తాం
- బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబర్ 18 : స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు వివిధ సంఘాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను క్రోడీకరించి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తామని బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన బహిరంగ విచారణ సమావేశంలో ఈ మేరకు ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ గుర్తింపు అంశంపై ఉమ్మడి జిల్లా పరిధిలో బహిరంగ విచారణలో భాగంగా కమిషన్ కార్యదర్శి సైదులు, కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు తదితరులతో కలిసి వివిధ సంఘాల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు.

ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల్లో దామాషా ఖరారు చేసేందుకు ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలో జనాభా వివరాలు వెల్లడించాలని, స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల కోసం అభిప్రాయ సేకరణ చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు.

పతకాలు అందుకున్న గోగేమ్ క్రీడాకారులు

పసిడి పరవశం

- జాతీయ గో-గేమ్‌లో పతకాల పంట

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 18 : మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించిన జాతీయస్థాయి బాల బాలికల 2వ సీనియర్, 1వ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ (సింగిల్, టీం ఈవెంట్) గో గేమ్ టోర్నీలో ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు ఐదు పసిడి, ఒక కాంస్య పతకం సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులతోపాటు కోచ్ మహ్మద్ షకీల్ అహ్మద్ డు గే-గేమ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నసురుల్లా హైదర్, కార్యదర్శులు గులాం అప్రోజ్, వినోద్‌కుమార్ అభినందించారు.

పతకాలు సాధించిన క్రీడాకారులు..

సబ్ జూనియర్ సింగిల్ విభాగంలో చేతన్ చంద్ర, శిరీష, సబ్ జూనియర్ విభాగంలో వర్షిత్, నజీమ్, శ్రీదత్త, బషీర్, రాజేశ్, జూనియర్ విభాగంలో సింగిల్ హారిక, సీనియర్ సింగిల్ విభాగంలో మహ్మద్ రయాన్ నజీమ్, బంగారు పతకాలు సాధించగా, జూనియర్ సింగిల్ విభాగంలో బషీర్ కాంస్య పతకం గెలుపొందాడు.

లంచం తీసుకుంటూ..

- ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ ఏఈ
- బిల్లుల చెల్లింపునకు రూ.50 వేలు డిమాండ్

అయిజ, నవంబర్ 18 : పంచాయతీరాజ్ శాఖలో ఇటిక్యాల ఏఈగా విధులు నిర్వహిస్తున్న పాండురంగారావు ఏసీబీ అధికారుల వలకు చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ తెలిపిన కథనం ప్రకారం.. ఎర్రవల్లి మండలంలోని రాజశ్రీ గార్లపాడులో రూ.28లక్షల నిధులతో చేపట్టిన మైనార్టీ కమ్యూనిటీ హాల్ (ఎస్‌డీఎఫ్) భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో చెల్లింపులు ప్రభుత్వం ద్వారా చేయించాలని ఏఈ పాండురంగారావును కాంట్రాక్టర్లు పలుమార్లు కలిశారు. పర్సెంటేజీ చెల్లిస్తేనే నిధుల విడుదలకు సహకరిస్తానని కాంట్రాక్టర్లకు ఏఈ తెగేసి చెప్పారు. భవన నిర్మాణ పనులను అప్పులు చేసి పూర్తి చేశామని, మీరు చెప్పినంత పర్సెంటేజీ ఇచ్చుకోలేమని ఏఈని ప్రాధేయపడినా ససేమిరా అనడంతో కాంట్రాక్టర్లు ఏసీబీ అధికార